క్లుప్తంగా

జగనన్న భూరక్ష స్టోన్ ప్లాంటేషన్



సరిపల్లిలో జగనన్న భూరక్ష స్టోన్ ప్లాంటేషన్ నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : జగనన్న భూరక్ష స్టోన్ ప్లాంటేషన్ కార్యక్రమం సరిపల్లి గ్రామ పరిధిలో నిర్వహించారు. పీఏసీఎస్ అధ్యక్షురాలు మందపాటి శ్రీదేవి, ఎంపీటీసీ బండి సీతారత్నం ఆధ్వర్యంలో ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటివరకు సరిపల్లి పంచాయతీ పరిధిలో వంకా బొత్తప్పగూడెం, మర్రిగూడెం గ్రామాలలో స్టోన్ ప్లాంటేషన్ కార్యక్రమం 80శాతం పూర్తి చేసామని వీఆర్వో అడప రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చింతలపూడి ఎస్సైగా ప్రసాద్ బాధ్యతల స్వీకరణ



చింతలపూడి : చింతలపూడి ఎస్సైగా కె.ప్రసాద్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన నిడదవోలు, లక్కవరం, ఏలూరు టూటౌన్ ఎస్సైగా పనిచేశారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన హరికృష్ణను అధికారులు వీఆర్‌కు పంపడంతో ఆయన స్థానంలో ప్రసాద్ బదిలీపై వచ్చారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య, అసాంఘిక కార్యకలాపాల నిరోధంపై ప్రత్యేక దృష్టి పెడతానని తెలిపారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

టి.నరసాపురం : అపరిష్కృతంగా ఉన్న ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఆశా వర్కర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కె.పోసమ్మ డిమాండ్ చేశారు. టి.నరసాపురంలో మండల ఆశా వర్కర్ల సమావేశం వై.విజయలక్ష్మి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పోసమ్మ మాట్లాడుతూ ఆశావర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, పని భారం తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, అంజన దేవి, వనిత, రమాదేవి, మేరీ తదితరులు పాల్గొన్నారు.

లిడ్ క్యాప్ డైరెక్టర్ సందీప్‌కు సత్కారం



సందీప్‌ను సన్మానిస్తున్న నాయకులు

లింగపాలెం : స్టేట్ లిడ్ క్యాప్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సొంగా సందీప్‌ను ఆదివారం కలరాయునగూడెంలో మండల ఎంఆర్‌పీఎస్ నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా సమయంలో సందీప్ స్వచ్ఛందంగా ప్రజలకు ఎన్నో సేవాకార్యక్రమాలు చేయటంతోపాటు, వైఎస్సార్ సీపీకి చేసిన సేవలకు సీఎం వైఎస్ జగన్‌మోహన రెడ్డి గుర్తించి లిడ్ క్యాప్ డైరెక్టర్ పదవిని ఇవ్వడం అభినందనీయమన్నారు. సన్మానం చేసిన పలు సంఘాల నాయకులకు సందీప్ కృతజ్ఞతలు తెలియజేశారు.

నిత్యం ట్రాఫిక్ ఇక్కట్లు

ఉంగుటూరు: టోల్ గేటును తప్పించుకునేందుకు వాహనదారులు ఉంగుటూరు రోడ్ల మీదుగా రాకపోకలు సాగించడంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. ఊళ్లోకి వచ్చే వాహనాలను నిరోధించాలని వారు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీని వల్ల నిత్యం ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవడంతోపాటు ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే వాసుబాబు దృష్టికి ప్రజలు ఈ సమస్యను తీసుకువెళ్లారు. ఇటీవల గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ టోల్ గేటు నుంచి వెళ్లకుండా గ్రామంలోకి వచ్చే వాహనాలను నిరోధించేలా అడ్డంగా గడ్డర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. భారీ వాహనాలు ఊరిలోకి రాకుండా పంచాయతీలో తీర్మానం చేయాలని ఆదేశించారు. దీనిపై గ్రామ పంచాయతీలో కదలిక కనిపించలేదు.

కారు ఢీకొని పాల వ్యాపారి దుర్మరణం

దెందులూరు: కారు ఢీకొని పాలవ్యాపారి అక్కడికక్కడే మృతి చెందిన వైనమిది. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెం నుంచి కారులో వస్తున్నవారు నిర్లక్ష్యంగా నడుపుతూ ఏలూరు నుంచి మేదినరావుపాలెం వెళ్తున్న పాల వ్యాపారి వీర్రాజును ఆదివారం జోగన్నపాలెం కనకదుర్గమ్మ గుడి వద్ద ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన వీర్రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మేదినరావుపాలెం సర్పంచ్ ఎం.దుర్గాకుమారి రాజు బంధువు వీర్రాజు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి హుటాహుటిన ఏలూరు ప్రభుత్వాసుపత్రికి వెళ్లారు. ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు.

శాకంబరీ అలంకరణలో..



శాకంబరీ దేవి అలంకరణలో శ్రీ చింతాలమ్మ అమ్మవారు

కొయ్యలగూడెం : శాకంబరీ అలంకరణలో విశేష దర్శనమిచ్చిన కొయ్యలగూడెం గ్రామదేవత శ్రీ చింతాలమ్మ అమ్మవారిని ఆదివారం భక్తులు విశేష సంఖ్యలో దర్శించుకున్నారు. రైతు అభ్యుదయ సంఘం, ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆసాది కె.వరలక్ష్మి, భక్తులు అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు పండ్లు ఆకుకూరలతో అలంకరించారు.

వానలు కురిపించు వినాయకా



వరసిద్ధి వినాయకుడికి జలాభిషేకం

పోలవరం రూరల్ : మండలంలోని నూతనగూడెంలో వేంచేసియున్న వరసిద్ధి వినాయకుడికి ఆదివారం గ్రామస్తులు జలాభిషేకం నిర్వహించారు. వర్షాలు బాగా కురిసి, పాడి పంటలు బాగా పండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థిస్తూ గ్రామస్తులు ఆలయానికి 101 బిందెలతో తీసుకువచ్చిన జలంతో వరసిద్ధి వినాయకుడిని అభిషేకించారు. కార్యక్రమంలో తైలం సత్యనారాయణ, జల్లేపల్లి బ్రహ్మయ్య, సూర్యనారాయణ, రాంబాబు, సుబ్బారావు, వెంకటేశ్వరరావు, కొణతాల ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్తికేయునికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

కొయ్యలగూడెం: స్థానిక శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాల స్వామి ఆలయ ప్రాంగణంలోని ఉపాలయమైన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం అన్నాభిషేకం నిర్వహిస్తామని ప్రధాన అర్చకులు గుడిపూడి శేషాచార్యులు తెలిపారు. తెల్లవారుజామున పంచామృతాభిషేకం నిర్వహిస్తామని, ప్రజలు వేకువ జామునుంచే పూజలలో పాల్గొనవచ్చునన్నారు. కాగా, మూలవిరాట్ విగ్రహాలకు ఆదివారం భక్తులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం



దాత సత్యగంగాధర్‌కు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ నటరాజారావు

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు ఆదివారం రూ. 1,00,000 విరాళంగా అందజేశారు. తూర్పుగోదావరి జిల్లా, రంగంపేట మండలం, వెంకటాపురానికి చెందిన పి.వీరవెంకట సత్యగంగాధర్ కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

కాపు కల్యాణ మండపంలో మరిన్ని అభివృద్ధి పనులు

కల్యాణ మండప ట్రస్టు చైర్మన్, ఉంగుటూరు ఎమ్మెల్యే వాసుబాబు



ద్వారకాతిరుమలలోని కాపు కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న సర్వసభ్య సమావేశం

ద్వారకాతిరుమల : కాపు కల్యాణ మండపం ఒక కులానికి మాత్రమే కాకుండా క్షేత్రంలో వివాహాలు చేసుకునే అన్ని కులాల వారికీ అందుబాటులో ఉంటుందని కల్యాణ మండప ట్రస్ట్ చైర్మన్, ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. స్థానిక శ్రీ వేంకటేశ్వర శ్రీకృష్ణ దేవరాయ వెల్ఫేర్ ట్రస్ట్ సర్వసభ్య సమావేశం వాసుబాబు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణ మండప అభివృద్ధిపై ట్రస్టు సభ్యులు చర్చించి, పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. అలాగే 2022–2023 వార్షిక బడ్జెట్‌ను ఆమోదించారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ కల్యాణ మండపంలో వివాహాలు చేసుకునే వారికి గతంలో కంటే మరింత మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. రాబోయే రోజుల్లో ట్రస్టు తరపున సేవా కార్యక్రమాలను సైతం నిర్వహిస్తామన్నారు. అలాగే ప్రధాన కల్యాణ మండప సముదాయంలోని శ్రీ ఆంజనేయ మినీ కల్యాణ మండపాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కల్యాణ మండపం వర్కింగ్ ప్రెసిడెంట్ చిన్నమిల్లి వెంకటరాయుడు, ట్రెజరర్ మాకా శ్రీనివాసరావు, స్థల దాత పెద్దిరెడ్డి వేణుగోపాలకృష్ణారావు, సభ్యులు నూకల లక్ష్మణ్, నంద్యాల కృష్ణమూర్తి, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, పల్నాటి బుజ్జి, అందే మహేష్, మైగాపుల మోహనరావు, పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎంఆర్‌పీఎస్, ఉద్యోగ సంఘాల నాయకులు

లింగపాలెం : కలరాయునగూడెంలో భారత ఉప ప్రధాని, దివంగత నేత డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహన్ని ఆదివారం ఎంఆర్‌పీఎస్ నాయకులు ఘనంగా ఆవిష్కరించారు. ప్రజల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ విగ్రహన్ని ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకులు ముళ్లపూడి సుమన్, రాష్ట్ర లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్, లింగపాలెం మండల ఎంఆర్‌పీఎస్ అధ్యక్షులు దుడ్డు వేణు, టీచర్స్ యూనియన్ నాయకులు సొంగా నాగేశ్వరరావు, మురళి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ దళితుల ఆశాజ్యోతి, పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి బాబూ జగ్జీవన్‌రామ్ విశేష కృషి చేశారన్నారు. కార్యక్రమంలో గ్రామ ఎంఆర్‌పీఎస్ అధ్యక్షులు ప్రేమ్‌కుమార్, యూత్ నాయకుడు వీరయ్య, ప్రభుదాసు, రారాజు, గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

జంగారెడ్డిగూడెం : అక్రమంగా ఎటువంటి అనుమతులు లేకుండా కోళ్ల వ్యర్థాలు రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెంలో తనిఖీలు నిర్వహిస్తుండగా స్థానిక మున్సిపల్ కార్యాలయ సమీపంలో గంటసాల సతీష్, కలిదిండి తాతారావు బొలేరో వాహనంపై కోళ్ల వ్యర్థాలను తరలిస్తూ కనిపించారన్నారు. వాహనాన్ని ఆపి తనిఖీ చేసి నిందితులను ప్రశ్నించగా, రాజానగరంలోని చేపలకు వేసే మేతను తయారు చేసే ఫ్యాక్టరీకి ఈ వ్యర్థాలను తరలిస్తున్నట్లు తెలిపారన్నారు. అయితే ఎటువంటి అనుమతిపత్రాలు లేకుండా వ్యర్థాలను రవాణా చేయడంతో పాటు, వాతావరణ కాలుష్యానికి కారణమయ్యారనే నేరంపై వారిద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. అలాగే వాహనాన్ని స్వాధీనం చేసుకుని , కోళ్ల మాంసం వ్యర్థాలను స్థానిక డంపింగ్ యార్డులో ఖననం చేయించినట్లు చెప్పారు.

స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలి



స్కీం వర్కర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు ఆవుల అశోక్

కుక్కునూరు : అంగన్‌వాడీ, ఆశ, కేజీబీవీ, మధ్యాహ్న భోజనం, గ్రామ పంచాయతీ తదితర రంగాలలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని భారత కార్మిక సంఘాల సమైక్య(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర నాయకులు ఆవుల అశోక్ డిమాండ్ చేశారు. ఆదివారం కుక్కునూరు చర్చి హాస్టల్‌లో కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు చెందిన స్కీమ్ వర్కర్ల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అశోక్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర పథకాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లి ప్రజలకు పథకాలను అందిస్తున్న స్కీం వర్కర్ల పట్ల ప్రభుత్వాలు బాధ్యత రాహిత్యంగా వ్యవహరించడం అన్యాయమన్నారు. మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీలకు బిల్లులు సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉండటం కారణంగా వడ్డీలు కట్టలేక వర్కర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేజీబీవీ, గ్రామపంచాయతీ మున్సిపల్ వర్కర్లు అధిక పని గంటలతో పని చేయించుకుని కనీస వేతనాలు ఇవ్వకపోవడమేంటని ప్రశ్నించారు. తక్షణమే కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని అంగన్‌వాడీ మధ్యాహ్న భోజనం బిల్లులను తక్షణమే విడుదల చేయాలని, కనీస వేతనం 18 వేలకు పెంచాలని, వర్కర్లకు ఈఎస్ఐ, పీఎఫ్ హెల్త్ కార్డులను అందించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్స్ సాధన కోసం భవిష్యత్తులో పెద్ద ఎత్తున కార్మిక పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వర్కర్లు రాజమ్మ, సత్యవతి, బంధం సింధు, టి.రమ్య, చిలకమ్మా , యాకోబు మేరి పద్మ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎంపీపీ విజయలక్ష్మి

కామవరపుకోట : ఇటీవల అనారోగ్యంతో విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందిన కామవరపుకోట మండలం రామన్నపాలెం గ్రామానికి చెందిన పాకలపాటి జోగేశ్వరావు కుమార్తె రాంపర్ల ఓంకార్ లక్ష్మి కుటుంబ సభ్యులకు ఆదివారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేశారు. బాధిత కుటుంబానికి ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి రూ.3 లక్షల చెక్కును అందించారు. సహాయ సహకారాలు అందించిన ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబుకు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రామన్నపాలెం వైఎస్సార్ సీపీ నాయకులు అన్నపనేని రాజశేఖర్, చెరుకూరి రవి పాల్గొన్నారు.

కేంద్రంలో బీజేపీకే మళ్లీ అధికారం ఖాయం



మాట్లాడుతున్న సీతారామాంజనేయ చౌదరి

జంగారెడ్డిగూడెం రూరల్ : రానున్న ఎన్నికల్లో మరోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టడం ఖాయమని ఆ పార్టీ ఏలూరు పార్లమెంటరీ కన్వీనర్ గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. ఆదివారం జంగారెడ్డిగూడెం మండలం పుట్లగట్లగూడెంలో బీజేపీ మండల అధ్యక్షులు పారేపల్లి వీర వెంకట సత్యనారాయణ అధ్యక్షతన మండల బీజేపీ నాయకుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న గారపాటి మాట్లాడుతూ ఉమ్మడి పౌర స్మృతి గురించి, అలాగే తొమ్మిదేళ్ల మోడీ పాలనలో ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి బీజేపీ కార్యకర్తలు విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా పేదల ఇంటి నిర్మాణానికి గ్రామీణ ప్రాంతంలో రూ.1,80,000, పట్టణ ప్రాంతంలో రూ.1,50,000 కేంద్రం ఇస్తున్న విషయాన్ని లబ్ధిదారులకు తెలిసే విధంగా తెలియజెప్పాలన్నారు. అనంతరం గ్రామంలో ఉపాధి హామీ పథకానికి వెళ్లి చెరువులో పడి మృతి చెందిన జుజ్జూరి నాగేశ్వరరావు కుటుంబాన్ని గారపాటి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి గణపవరపు రామచంద్రరావు, రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు అర్జుల మురళి, చింతలపూడి అసెంబ్లీ కన్వీనర్ చౌటుపల్లి విక్రమ్ కిషోర్, జిల్లా ఉపాధ్యక్షులు వేమూరి శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలి



పద్మశ్రీ, ప్రసాదరావు దంపతులను సత్కరిస్తున్న కొప్పుల వెలమ సంఘం ప్రతినిధులు

ఏలూరు(మెట్రో): కొప్పుల వెలమ కులస్తులు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ క్యాంప్ కార్యాలయంలో పద్మశ్రీ, ప్రసాదరావు దంపతులను ఆదివారం ఉదయం ఏలూరులోని కొప్పుల వెలమ సంఘం నాయకులు మరడా అనిల్ కుమార్, కార్పొరేటర్ కిలాడి దుర్గారావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు మాట్లాడుతూ బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన జగనన్నకు అండగా నిలవాలని కోరారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని చొరవతో తమ సంఘీయులు సాధించుకున్న 600 గజాల స్థలంలో సంఘం భవన నిర్మాణానికి తన వంతు సహకారం ఉంటుందన్నారు. నాయకులు మరడా అనిల్ కుమార్, కిలాడి దుర్గారావు మాట్లాడుతూ కొప్పుల వెలమలకు జిల్లాలో అత్యున్నత జెడ్పీ చైర్ పర్సన్ పదవిని ఇచ్చి గౌరవించిన సీఎం జగనన్నకు, తమ సామాజిక వర్గాన్ని ఎంపిక చేయడానికి సహకరించిన ఎమ్మెల్యే ఆళ్ల నానికి కృతజ్ఞతలు తెలిపారు. న్యాయవాది బొంగు అచ్యుతరావు మాట్లాడుతూ పార్టీకి అండగా నిలిచిన ఘంటా ప్రసాదరావు ద్వారా కొప్పుల వెలమ సంఘానికి మంచి గుర్తింపు వచ్చిందన్నారు. కార్యక్రమంలో గొట్టాపు మోహన్, కోట ఈశ్వర దత్తు, బళ్ల శ్రీను, సమ్మంగి కుమార్, బొమ్మి శేషు, తెంటు సూర్యనారాయణ, కర్రా హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల అభివృద్ధికి కృషి



బ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందచేస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): బ్రాహ్మణుల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నట్టు శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సమితి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు తోలేటి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక రామచంద్రరావుపేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థాన కల్యాణ మండపంలో నిర్వహించిన సంఘం జిల్లా కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. భావ సారూప్యం గల సంఘాలను తమ సంఘ పరిధిలోకి తీసుకొచ్చి బ్రాహ్మణులకు మరింత సేవా కార్యక్రమాలు అందుబాటులోకి తెస్తామన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ మనుగడకు ఏడాదికి రూ.500 కోట్ల నిధులు విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సంఘం కార్యదర్శి కాశీభొట్ల పార్వతీశ్వర శర్మ మాట్లాడుతూ పేద బ్రాహ్మణ వధూవరులకు కల్యాణమస్తు పథకం కింద వివాహానికి ప్రభుత్వం సహకరించాలని, గరుడ పథకం కింద పేద కుటుంబంలో బ్రాహ్మణులు చనిపోతే వారి కుటుంబ అవసరాల నిమిత్తం ఆర్థిక సాయం రెట్టింపు చేయాలని కోరారు. ఈ సందర్భంగా 2022–23 విద్యా సంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్లలో 90 శాతానికి పైగా మార్కులు సాధించి ఉత్తీర్ణులైన 45 మంది బ్రాహ్మణ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం, సర్టిఫికెట్, జ్ఞాపిక అందించి అభినందించారు. కార్యక్రమంలో సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు బుద్ధవరపు సుబ్బారావు, కోశాధికారి అమ్మనమంచి మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు అనిపెద్ది రామకృష్ణ, యువజన అధ్యక్షుడు మాగి సంతోష్, ఏలూరు బ్రాహ్మణ ఐక్య కార్యాచరణ వేదిక అధ్యక్షుడు టీఆర్ శర్మ, అఖిల భారత బ్రాహ్మణ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు ఎంబీఎస్ శర్మ, ద్రోణంరాజు వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు లక్కవరంలో జగనన్న సురక్ష

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని లక్కవరంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు వామిశెట్టి హరిబాబు తెలిపారు. ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని వివరించారు.

మోటార్‌సైకిల్ చోరీపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : మోటార్‌సైకిల్ చోరీపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ జె.మోషే తెలిపారు. చింతలపూడి మండలం అల్లిపల్లికి చెందిన గట్టు జాన్ ఫిబ్రవరి 23న తాడువాయిలో జరిగిన శివరాత్రి తిరునాళ్లకు తన మోటార్‌సైకిల్‌పై వచ్చాడన్నారు. బైక్‌ను పార్క్‌చేసి తిరునాళ్లకు వెళ్లి, తిరిగి వచ్చి చూసేసరికి మోటార్‌సైకిల్ కనిపించలేదన్నారు. అప్పటి నుంచి మోటార్‌సైకిల్ కోసం వెదికినా ఫలితం లేకపోవడంతో ఆదివారం ఫిర్యాదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

12న ఎంఆర్‌పీఎస్ జాతీయ సమావేశం

ఏలూరు (టూటౌన్): ఈ నెల 12న వరంగల్‌లో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ జాతీయ సమావేశం నిర్వహించనున్నట్టు ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకులు బయ్యారపు రాజేశ్వరరావు తెలిపారు. ఎంఆర్‌పీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కాశీకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక గన్‌బజార్ సెంటరులో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ ముఖ్యనాయకుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ రాబోయే వర్షాకాలం సమావేశంలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో జాతీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. కాశీకృష్ణ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ఎస్సీల్లో ఉన్న 59 ఉపకులాలకు 15 శాతం రిజర్వేషన్‌ను దామాషా ప్రకారం సమానంగా కేటాయించాలన్నారు. ఎస్సీ సంక్షేమ నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకురాలు నమ్మిన లక్ష్మి, జిజ్జువరపు మేరీ, చాట్ల శౌరి, చొదిమెళ్ల బుజ్జి, చిగురుపాటి రోసీ, రియాజ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

కథ చెబుతారా ఊ కొడతాం విజేతలు వీరే



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో కథ చెబుతారా ఊ కొడతాం శీర్షికతో ధర్మ, అర్థ, కామ, మోక్ష సంబంధిత నీతి, భక్తి కథలపై ఆదివారం స్థానిక రామచంద్రరావుపేట శ్రీమత్ మార్కండేయ వేద పాఠశాలలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. జూనియర్స్ విభాగంలో కె.గీతామాధురి (శర్వాణి పబ్లిక్ స్కూల్) ప్రథమ, జె.రామ మాధవ్ (సీఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్) ద్వితీయ, కె.జోషిత (శర్వాణి పబ్లిక్ స్కూల్) తృతీయ, సీనియర్స్ విభాగంలో ఎ.వేద సరస్వతి (సీఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్) ప్రథమ, కె.దేవి (శర్వాణి పబ్లిక్ స్కూల్) ద్వితీయ, పీఎస్ఆర్ కార్తికేయ (కేంద్రీయ విద్యాలయం) తృతీయ బహుమతులు సాధించారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా మైలవరపు లక్ష్మీనరసింహం, ఎంవీఎస్ సత్యనారాయణ, ఎస్‌వీఎస్ఎస్ మూర్తి వ్యవహరించారు. అతిథులు విజేతలకు బహుమతులు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ టీటీడీ జిల్లా ప్రోగ్రామ్ అసిస్టెంట్ బీఎస్ఆర్ సుబ్రహ్మణ్యం కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి

దరఖాస్తుల ఆహ్వానం

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీవో పి.బ్యూలా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు 7వ వార్డులో (ఎస్టీ మహిళ), 19వ వార్డులో (జనరల్), 26వ వార్డులో (బీసీ–బి) పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. అలాగే అంగన్‌వాడీ సహాయకులకు గాను, జంగారెడ్డిగూడెం మండలం ఎ.పోలవరం (బీసీ–ఎ), జంగారెడ్డిగూడెం 24వ వార్డు (ఓపెన్), వీరన్నగూడెం (ఓపెన్ – హియరింగ్ హ్యాండీక్యాప్), జంగారెడ్డిగూడెం 15, 16వార్డుల అంగన్‌వాడీ కేంద్రం (బీసీ–ఎ), పర్రెడ్డిగూడెం (ఎస్సీ), పోలాసిగూడెం (ఓపెన్) పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే మహిళలు వివాహితులై, స్థానికులై, 35 సంవత్సరాలలోపు వయసు కలిగి ఉండి, 10వ తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. దివ్యాంగులైతే తక్కువ స్థాయి వైకల్యం ఉన్న వారు మాత్రమే అర్హులన్నారు. దరఖాస్తులను ఈ నెల 15వ తేదీ లోగా జంగారెడ్డిగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అందించాలన్నారు. దరఖాస్తుకు అవసరమైన కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు రెవెన్యూ అధికారులచే ధ్రువీకరించినవి మాత్రమే జతచేయాలని సూచించారు. వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.